## క్లుప్తంగా

### ప్రజా సేవకుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న షోయబ్ రహమాన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన ఫరాష్ షోయబ్ రహమాన్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. కర్నూలు నీడీ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులుగా, డేనియల్ రాజు ఫౌండేషన్‌కు జనరల్ సెక్రటరీగా ఉన్న ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను అమెరికన్ యూనివర్సిటీ గ్లోబల్ పీస్ ద్వారా ఆదివారం చెన్నైలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా షోయబ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి డాక్టరేట్‌కు ఎంపిక చేసిన అమెరికన్ యూనివర్సిటీ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


జీవన్

కర్నూలు (టౌన్): స్థానిక లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాలకు చెందిన జీవన్ అనే విద్యార్థి అండర్-14 స్కూల్‌గేమ్స్ జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల సీఈఓ గోపీనాథ్ అభినందించారు. క్రీడాకారుడు జీవన్ ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని రాజ్‌నంద్‌గాన్ అనే పట్టణంలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ పాల్గొన్నారు.

### బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించాలి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

కర్నూలు (టౌన్): బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం బాస్కెట్‌బాల్ ఎరీనా కోర్టులో బాలబాలికల ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదా బాషా మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులు వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

### ఫారెస్ట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని క్లబ్ క్యాంటీన్‌లో ఆదివారం ఏపీ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో కర్నూలు యూనిట్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ కలాం, కార్యదర్శిగా మౌలాలి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రతిదేవి, జాయింట్ సెక్రటరీగా కాళిదాస్, కోశాధికారిగా అనురాధను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, శశిభూషణ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా పరిధిలో అటవీ సంరక్షణకు కృషి చేస్తామన్నారు.

### యాదవులు ఐక్యంగా ఉండాలి


ఐక్యత తెలుపుతున్న యాదవ నాయకులు

కర్నూలు కల్చరల్: యాదవులందరూ ఐక్యంగా ఉండి ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని సంఘం పెద్దలు డాక్టర్ బాల మద్దయ్య, ఏపీ రామయ్య యాదవ్, నాగరాజు యాదవ్ సూచించారు. ఆదివారం నగర శివారులోని జగన్నాథగట్టుపై యాదవుల కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. నగరంలో ఏర్పాటు చేయబోయే యాదవ భవన్‌కు టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. చిన్నారులు, మహిళలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విజయభాస్కర్ అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు ఓంకార్ యాదవ్, ఎర్రదొడ్డి రాముడు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఉరుకుందలో రుద్రహోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 19 మంగళవారం రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హోమంలో పాల్గొనదలచిన భక్తులు రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

# మురుగు కాల్వల నిర్మాణాలకు ప్రాధాన్యం




వెంకటరమణ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు, ఖనా-ఖజానా వద్ద ఉన్న అడ్డుగోడను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కర్నూలు (టౌన్): నగరంలో పలు కాలనీలలో మురుగు కాల్వల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక 44వ వార్డు పరిధిలోని వెంకటరమణ కాలనీలో స్థానిక కార్పొరేటర్ రాజేశ్వర రెడ్డితో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలు పరిశీలించారు. పలు వీధుల్లో ఉన్న సమస్యలను కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, స్థానిక కార్పొరేటర్లు సూచించిన సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనేక చోట్ల తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు.

## అడ్డుగోడ కూల్చివేత

స్థానికుల ఫిర్యాదు మేరకు నగరపాలక అధికారులు చర్యలు చేపట్టి రాకపోకలకు అడ్డంగా ఉన్న గోడను తొలగించారు. రెండు రోజుల క్రితం ఇదే సమస్యపై స్థానిక ప్రజలు నగరపాలక ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ ప్రాంతాన్ని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబుతో పాటు మున్సిపల్ ఎస్‌ఈ రాజశేఖర్ పరిశీలించారు. అడ్డుగోడ వల్ల బిర్లాగేట్ నుంచి సిల్వర్ జూబ్లీ కళాశాలకు వెళ్లే ప్రజలు, ఆటోలు, వాహనాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఒకే రహదారి పోస్టాఫీసు మీదుగా వెళుతుండటంతో నిరంతరం రద్దీగా ఉంటోంది. డీఐజీ, ఇతర ఉన్నతాధికారులు సైతం ఇదే రహదారి గుండా వెళుతుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన నగరపాలక అధికారులు.. జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద ఉన్న అడ్డుగోడను ఆదివారం సాయంత్రం తొలగించారు. ఈ గోడను తొలగించడం ద్వారా ఇరువైపులా రాకపోకలు సాగించేందుకు వీలు కలిగింది. దీంతో కలెక్టరేట్, కృష్ణానగర్ నుంచి వచ్చే వాహనాదారులు చుట్టూ వెళ్లకుండా ఖనా-ఖజానా రహదారి మీదుగా సిల్వర్ జూబ్లీ కళాశాల, డీఐజీ ఆఫీసు, దిన్నెదేవరపాడు రోడ్డుకు వెళ్లేందుకు లైన్ క్లియర్ అయ్యింది.

### తైక్వాండో ఉచిత శిక్షణ

కర్నూలు (టౌన్): తైక్వాండో శిక్షణ కేంద్రాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లోని కేఎంసీ పార్కులో తైక్వాండో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. క్రీడాకారులకు తైక్వాండో కిట్లు పంపిణీ చేసిన అనంతరం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. మాస్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### 14న రాష్ట్రస్థాయి పోటీలు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ధర్మపేటలో వచ్చే నెల 14, 15 తేదీల్లో అండర్-14 విభాగంలో సబ్ జూనియర్ క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్వగృహంలో పోటీలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మాస్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అలరించిన నాటక ప్రదర్శన


కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'ఇది రహదారి కాదు' సాంఘిక నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. 'సమాజంలో స్వేచ్ఛ ఉంది కానీ అనేక సాంస్కృతిక దాడులు ఈదేశాన్ని చుట్టు ముట్టాయి. పెళ్లి కాకుండానే కలిసి ఉండటం అనే దిక్కుమాలిన సంస్కృతి ఇప్పుడు మన దేశంలో అడుగు పెట్టింది. ఇద్దరు సంపాదిస్తారట, కలిసి ఉంటారంట పిల్లల్ని కనరంట ఇది దేశానికి వినాశకరం' అనే సందేశాన్ని ఇస్తూ హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. ఆకురాతి భాస్కర్ చంద్ర రచించిన ఈ నాటకానికి ఎస్.ఎం.బాషా దర్శకత్వం వహించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. రాయలసీమలో సాంఘిక నాటకాలకు ఆదరణ పెంచేందుకు ప్రతి నెలా ఒక సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమ కన్వీనర్‌లుగా సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న వ్యవహరించారు. బీసీ జాతీయ సంఘం నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, ఆర్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రంగనాయకులు, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు పాల్గొన్నారు.

## కళాకారులకు దుస్తుల పంపిణీ


మాట్లాడుతున్న డాక్టర్ సుభాన్

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో 20 మంది మహిళా కళాకారులు, 10 మంది పురుష కళాకారులకు దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. దాత డాక్టర్ ఎస్.జి.ఎం. సుభాన్ ఆర్థిక సహకారంతో కార్యక్రమం నిర్వహిటొంచినట్లు సంఘం అధ్యక్షుడు గుర్రపు శాల అంకయ్య తెలిపారు. బీసీ సంఘం జాతీయ నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, సీనియర్ కళాకారులు దస్తగిరి, బైలుప్పల షఫి, కేవీ సుబ్బారెడ్డి తదితరులు కళాకారులకు దుస్తులను పంపిణీ చేశారు.

# వీధిలైట్లు ఏర్పాటు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు (టౌన్): నగర శివారులోని రిచ్‌మండ్ కాలనీ, సురేష్ హోమ్ కాలనీలలో వీధిలైట్లు ఏర్పాటుచేసి దొంగతనాలు అరికట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి కాలనీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కర్నూలు నగరపాలక సంస్థలో ఒక్క పని కూడా చేయలేదన్నారు. కనీసం వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో విన్నవించినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గత వారం ఇదే కాలనీలో దొంగలు పడి రూ.20 లక్షలు దోచుకుపోయారని, దొంగల భయంతో నిత్యం ఆందోళనకు గురవుతున్నామన్నారు. వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు పీటర్, వెంకటరెడ్డి, అనిల్, చెంగయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

# 26న రైతు కార్మిక సంఘాల మహాప్రదర్శన


మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న చర్యలను ఖండిస్తూ నవంబర్ 26వ తేదీన మహాప్రదర్శన, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని రైతు రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వేర్‌హస్ హమాలీ యూనియన్ బాడీ సమావేశం కార్మిక, కర్షక భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికుల కడుపు కొడుతుందని విమర్శించారు. హక్కుల కోసం పోరాటాల్లో భాగంగా నవంబర్ 26న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నరసింహులు, నాయకులు విష్ణుమూర్తి, సుధాకర్, మధు, రంగన్న, గోవిందు, ఇషాక్, విజయుడు పాల్గొన్నారు.

# అపార్‌తో విద్యా బోధనకు ఆటంకం

కర్నూలు సిటీ: విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రంలోని వివరాలు, ఆధార్‌లోని వివరాలు, పాఠశాల అడ్మిషన్ రికార్డుల్లోని వివరాలు సరిపోతేనే ఆన్‌లైన్‌లో అపార్ నంబరు కేటాయించేందుకు వీలవుతుందని, లేకపోతే సాధ్యం కాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.జి వెంకట్రాముడు, తిమ్మప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపార్‌తో విద్యా బోధనకు ఆటంకం కలుగుతుందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 1 నుంచి 12 తరగతులకు చెందిన విద్యార్థులకు అపార్ నంబర్లను కేటాయించడం కోసం డిజిటల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. విద్యార్థుల వివరాలు ఆధార్, బర్త్ సర్టిఫికెట్, స్కూల్ రికార్డుల్లో వేర్వేరుగా ఉన్నాయని, ఈ సమస్యను ఆన్‌లైన్‌లో సాఫ్ట్‌వేర్‌లో సరిదిద్దాల్సినన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆ పని చేయకుండా మండల స్థాయి అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లపై అపార్ నమోదు పూర్తి చేయాలని ఒత్తిళ్లు చేయడం వల్ల స్కూళ్లలో బోధనకు ఆటంకంగా మారిందని వివరించారు. రికార్డులో తప్పొప్పులను సరిచేసుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సచివాలయాలు, ఆధార్ నమోదు కేంద్రాల చుట్టు తిరుగుతున్నారని తెలిపారు. ఇప్పటికే పదో తరగతి నామినల్ రోల్స్ తయారీలో హెచ్‌ఎంలు తలమునకలు అవుతున్నారని, ఇప్పుడు బోధనేతర పనులు అప్పగించడం సమంజసంగా లేదని పేర్కొన్నారు. వివరాలు సరిదిద్దేందుకు ఆన్‌లైన్‌లో 15-20 రోజుల సమయం పడుతుందని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

# దేవరగట్టులో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మూలమూర్తులు

హొళగుంద: దేవరగట్టులో కార్తీక మాసం మూడవ వారంలో భాగంగా ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, కుంకుమార్చన, భండారార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి, ఆకుపూజ, నివేదన, నిరాజనం తదితర పూజలు చేపటి నైవేద్యం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

## ఈరోజు..

### సత్యసాయి జయంతి

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలు ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు వన్‌టౌన్ ఇస్కాల శ్రీకృష్ణ స్వామి సత్రంలో నిర్వహించనున్నట్లు ఇస్కాల శ్రీకృష్ణ స్వామి సమితి కన్వీనర్ తెలిపారు. 18న సామూహిక సత్యనారాయణ సత్యసాయి వ్రతం, 19న మహిళా దినోత్సవం, 20న నారాయణ సేవ, వృద్ధాశ్రమాలకు భోజనం పంపిణీ, 21న గోశాలలో గోవులకు గ్రాసం పంపిణీ, 22న బాల వికాస్ చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు - బహుమతుల ప్రదానం, 23న ఓంకారం, సుప్రభాతం, షోడసోపచార పూజ, పల్లకీ సేవ, నగర సంకీర్తన, సాయి జయంతి వేడుకలు జరుగుతాయని తెలిపారు. సాయి భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.
- నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు సామూహిక సత్యసాయి వ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### నగరపాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు స్థానిక సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు.

### కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు(సెంట్రల్): సొంతిల్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించనున్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక నేతలు అన్ని ఏర్పాట్లు చేశారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): స్థానిక కొత్తపేటలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని, ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు.

### వీఆర్వో మృతికి నివాళి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు గ్రామ రెవెన్యూ అధికారి నిడ్జూరు వెంకటేశ్వర్లు మృతికి ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు మౌళిబాషా, కోశాధికారి కె.శ్రీధర్, వీఆర్వో శ్రీనివాసులు నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు గుండెపోటుతో మరణించడం బాధాకరమని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

### క్యాంటీన్ పునఃప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆధునీకరించిన క్యాంటీన్‌ను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతికి, మార్కెట్ యార్డు అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, పలువురు టీజీవీ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### పోక్సో కేసు నమోదు

కర్నూలు(సెంట్రల్): బాలికను లైంగికంగా వేధించిన అజయ్ అనే వ్యక్తిపై రెండో పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నగరంలోని చదువుల రామయ్య నగర్‌లో నివాసం ఉంటున్న 17 ఏళ్ల బాలికను నిందితుడు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న రెండో పట్టణ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

కర్నూలు(సెంట్రల్): వన్ టౌన్‌లో నివాసం ఉంటున్న తన భార్య పర్వీన్ ఖాతూన్ (32) కనిపించడం లేదని భర్త పోలీసులను ఆశ్రయించారు. పర్వీన్ ఖాతూన్ ఆదివారం మదరసాలో చదువుతున్న తన కుమారుడిని తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త అజీం బాషా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# భగవద్గీత పోటీలకు విశేష స్పందన


విజేతలతో చిన్మయ మిషన్ నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత పోటీలకు విశేష స్పందన లభించింది. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి అధ్యక్షతన ఆరు గ్రూప్‌ల్లో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, చిన్మయ మిషన్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, కార్యదర్శి టీవీ రత్నప్రసాద్, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, ఆవోపా చీఫ్ నాగేశ్వరరావు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

# జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): విజయనగరంలో నవంబర్ 27, 28, 29, 30 తేదీల్లో జరిగే ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్ భవన్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ తీర్మానాలు చేస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అభి, అశోక్, పండు, సునీల్, అదిల్, బాష పాల్గొన్నారు.

# కొత్తూరులో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యేశ్వరుడు, స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మస మూడవ ఆదివారం భక్తులు సందడి నెలకొంది. స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు క్యూకట్టారు. స్వామి వారికి ఇష్టమైప చలివిపిండి, పాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు మూడు గంటలకుపైగా పట్టిందని భక్తులు తెలిపారు.

### భోగేశ్వరంలో....

గడివేముల: దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో సందడిగా మారింది. పంచకోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ దుర్గాభోగేశ్వరుడి దర్శించుకుని అభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ రామానుజన్ పర్యవేక్షించారు. పూజల అనంతరం భక్తులు కాశీనాయన ఆశ్రమంలో అన్నదానం స్వీకరించారు.

### బుగ్గరామేశ్వరుని సన్నిధిలో లోకాయుక్త జడ్జి


జడ్జి దంపతులను సత్కరిస్తున్న ఆలయ ఈఓ మద్దిలేటి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామిని ఆదివారం ఏపీ లోకాయుక్త జడ్జి రజనీ దంపతులు దర్శించుకున్నారు. జడ్జి దంపతులు స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఈఓ మద్దిలేటి, ఆలయ అర్చకులు లక్ష్మినారాయణశర్మ ఆలయ మర్యాదలతో సత్కరించారు.

### కోలుకోలేక విద్యార్థి మృతి

సి.బెళగల్: పాఠశాలకు వెళ్లడంలేదని తండ్రి మందలించడంతో మనస్థాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి కోలుకోలేకు మృతి చెందినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్‌ఐ తెలిపిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీలో నివాసము ఉంటున్న కురువ పరమేష్ పెద్ద కుమారుడు శివప్రసాద్ (17) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అయితే శివప్రసాద్ పాఠశాలకు సక్రమంగా వెళ్లడంలేదని తండి మందలించడంతో ఈనెల 15వ తేదీన ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగాడు. కల్లందొడ్డిలో అపస్మారక స్థితి పడిఉండగా గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కోలుకోలేక విద్యార్థి శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం మృతుడి తండ్రి పరమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఒకే నంబర్ టికెట్లపై కమిషనర్ ఆరా

మహానంది: మహానంది దేవస్థానంలో టికెట్ల జారీలో గోల్‌మాల్ జరిగిందన్న విషయంపై దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సత్యనారాయణ ఆరా తీసినట్లు సమాచారం. ఒకే నంబరుతో రెండేసి చొప్పున టికెట్లు వచ్చినట్లు ఆదివారం ప్రచారం జరిగింది. అయితే గోల్‌మాల్, ఎలాంటి అవినీతి జరగలేదని ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ నెల 9వ తేదీన, 12వ తేదీన ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లలో సాంకేతిక కారణాలు తలెత్తడంతో కంప్యూటర్ల ద్వారా కాకుండా పీఓఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారన్నారు. అలా టికెట్లు జారీ చేసే సమయంలో సాంకేతిక లోపాలతో ఒకే నంబరుతో ఒకే సమయంలో రెండేసి చొప్పున టికెట్లు వచ్చాయన్నారు.

### డివైడర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు




శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి చెందిన టోల్‌గేట్ వద్ద పెను ప్రమాదం తప్పింది. ఆదివారం కాకినాడకు చెందిన 38 మంది భక్తులు ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో శ్రీశైలం వస్తుండగా దేవస్థాన టోల్‌గేట్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న భక్తులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు.